క్లుప్తంగా...

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.21, నల్లవంకాయ 15, పొడుగు వంకాయ 15, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 22, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు మాస శివ రాత్రి పూజలు

సనత్‌నగర్: పుష్యమాసం బహుళ చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శివాలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటల (ప్రదోష కాలం) సమయంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, దర్శనం ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



లాలాగూడ ఎస్‌హెచ్‌ఓ పద్మను సన్మానిస్తున్న చర్చి పాస్టర్లు

లాలాపేట: తార్నాక డివిజన్ చర్చెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బుధవారం లాలాగూడ పోలీసు స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓ పల్లె పద్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ జి. సుదర్శన్, కార్యదర్శి బాల్‌రాజు, కోశాధికారి ఆచార్య అహరోన్ తీగుళ్ల, లీగల్ అడ్వయిజర్ అజరయ్య మోజెస్, సభ్యులు జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు



సనత్‌నగర్: హనుమాన్ దేవాలయంలోని హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. 123 రోజులకు గాను దేవాలయ ప్రాంగణంలోని 20 హుండీల ద్వారా రూ.10,97,218 ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, హనుమాన్ దేవాలయం ఈఓ శ్రీనివాసరాజుల సమక్షంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు హుండీలను లెక్కించారు.

సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌గుప్తా



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సనత్‌నగర్ జెక్‌కాలనీకి చెందిన గంగాధర్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా బుధవారం ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ తనకు జిల్లా ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి పాటుపడతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, సనత్‌నగర్ ఇన్‌ఛార్జ్ కోట నీలిమలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించాలి



పరికి నర్సింగరావు

లాలాపేట: బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు దారుణమని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ పరికి నర్సింగరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాల్క సుమన్‌కు కేసీఆర్ కుటుంబానికి కాపలా కుక్కలా ఉండటం తప్ప ఏమీ తెలియదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఒక్క చెప్పు చూపిస్తే తాము వంద చెప్పులు చూపిస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తిరస్కరించినా బీఆర్‌ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదన్నారు. ఇంకా తామే అధికారంలో ఉన్నట్లు భ్రమల్లో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి చిత్తుగా ఓడించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయంలో కేటీఆర్ స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి

తక్షణ చర్యలు

జనాభా అవసరాలకు అనుగుణంగా నూతన పైపులైన్ల ఏర్పాటు

మారేడ్‌పల్లి జలమండలి నూతన జీఎం వినోద్‌కుమార్‌తో 'సాక్షి' ముఖాముఖి

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో మంచినీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సికింద్రాబాద్ మారేడ్‌పల్లి డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్ కేఎస్ వినోద్‌కుమార్ తెలిపారు. జనాభా అవసరాలకు అనుగుణంగా పురాతన పైపులైన్ల స్థానంలో నూతన మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుధవారం మారేడ్‌పల్లి డివిజన్ నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌కుమార్‌తో 'సాక్షి ముఖాముఖి' నిర్మాణాత్మక కార్యక్రమాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాము. గతంలో ఇక్కడ పనిచేసిన రమణారెడ్డి ఆకస్మిక మృతి కారణంగా జీఎం పోస్ట్ చాలా కాలంగా ఖాళీగా ఉంది. జీఎం లేకపోవడంతో జలమండలిలో తిష్ట వేసిన సమస్యలపై 'సాక్షి'లో 'పడకేసిన పాలన వ్యవస్థ' శీర్షికన వార్త కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జలమండలి ఉన్నతాధికారులు నూతన జీఎంగా వినోద్‌కుమార్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. జలమండలి ఐటీ సెల్‌లో పని చేసిన ఆయన బదిలీపై మారేడ్‌పల్లి డివిజన్‌కు వచ్చారు.

– బన్సీలాల్‌పేట్



జలమండలి నూతన జీఎం కేఎస్ వినోద్‌కుమార్

Interview

ప్రశ్న: సికింద్రాబాద్‌లో మంచినీటి సరఫరా.... డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జీఎం: మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాము. జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేస్తున్నాము. రోజు విడిచి రోజు 1.30 గంటల పాటు నీటిని సరఫరా చేస్తున్నాం. ఎళ్ల క్రితం వేసిన పైపులైన్ల కారణంగా అక్కడక్కడా నీరు లీకేజీ అవుతోంది. వెంటనే వాటికి మరమ్మతులు చేస్తున్నాం. ఆధునిక యంత్రాలతో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తున్నాం.

ప్రశ్న: మారేడ్‌పల్లి డివిజన్‌లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?

జీఎం: డివిజన్ పరిధిలో బోయిగూడ, హుస్సేన్ సాగర్, మారేడ్‌పల్లి, తార్నాకా, లాలాపేట్, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, శ్రీనివాస్‌నగర్, నల్లగుట్ట, ప్రకాష్‌నగర్, బౌద్ధనగర్, రెజిమెంటల్ బజార్ 12 సెక్షన్ కార్యాలయాల ద్వారా కార్యకలాపాలను సజావుగా నిర్వహిస్తున్నాం. ఓ ఎలక్ట్రికల్ మేనేజర్ కూడా ఉన్నారు. డివిజన్ పరిధిలో 20 రిజర్వాయర్ల ద్వారా పైపులైన్ల వ్యవస్థతో ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నాం. అన్ని సెక్షన్ల మేనేజర్లు మంచినీటి సరఫరా.. డ్రైనేజీ పరమైన సమస్యలు.. నీటి లీకేజీ వంటి విషయాల్లో ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ చర్యలు చేపడుతున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: డివిజన్ పరిధిలో మంచినీటి కనెక్షన్లు, నీటి డిమాండ్, ఆదాయం వివరాలు ఎలా ఉన్నాయి?

జీఎం: మారేడ్‌పల్లి డివిజన్ పరిధిలో సుమారు 65,700 మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా మంచినీరు, డ్రైనేజీ సెస్ రూపంలో సుమారు రూ.5 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. ప్రతి రోజు 24 ఎంజీడీ(మిలియన్ గ్యాలన్స్ పర్ డే) మంచినీటిని సరఫరా చేస్తున్నాము. ఎక్కడా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: ప్రధాన రహదారులపై డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జీఎం: మెయిన్ రోడ్లపై డ్రైనేజీ మురికినీటి ప్రవాహాన్ని అరికట్టేందుకు సివరేజ్ క్లీనింగ్ మిషన్లను వినియోగిస్తున్నాం. చిన్నపాటి సందుల్లో మినీ క్లీనింగ్ యంత్రాలను వాడుతున్నాం. ప్రతి సెక్షన్ పరిధిలో ఆధునిక డ్రైనేజీ క్లీనింగ్ మిషన్లను వినియోగించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాము. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ క్లీనింగ్ కోసం ఎయిర్‌టెక్ పెద్దవి 7 మెషిన్లు, చిన్నవి 10 ఉన్నాయి. ఒక్క ఫోన్ కాల్‌తో మా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తున్నారు.

ప్రశ్న: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందిస్తున్న తీరు ఎలా ఉంది?

జీఎం: ప్రజలు మంచినీటి, డ్రైనేజీ పరమైన సమస్యలపై 155313 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే మాకు సమాచారం అందుతుంది. సెక్షన్ మేనేజర్లు సిబ్బందిని ఆయా సమస్యల పరిష్కారానికి పంపిస్తారు. డివిజన్ పరిధిలో ప్రతి రోజు సుమారు 100 నుంచి 140 వరకు ఫిర్యాదు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నాము. మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి సమస్యల విషయంలో ప్రజలకు తమను నేరుగా కలిసి వివరించవచ్చు.

ప్రశ్న: సమస్యలపై సకాలంలో స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి?

జీఎం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాము. సమస్యలపై నిర్లక్ష్యానికి తావులేకుండా సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాము. ప్రతి సెక్షన్ పరిధిలో మేనేజర్, డీజీఎం స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. సమస్యల పరిష్కారం విషయంలో ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగితే ప్రజలు నేరుగా నాకు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాము. ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యాన్ని సహించే ప్రసక్తే లేదు. మేము ఉన్నదే ప్రజలకు సేవ చేసేందుకు ఆ దిశగా ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాం.

పార్ట్‌టైం టీచర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి



కూనంనేనికి వినతి పత్రం అందజేస్తున్న యూనివర్సిటీ పార్ట్‌టైం టీచర్లు

లాలాపేట: యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్‌టైం టీచర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్ల అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు బుధవారం సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావును కలిసి వివిధ విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న పార్ట్‌టైం టీచర్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. త్వరలో జరుగనున్న శాసన సభ సమావేశాల్లో తమ సమస్యలపై మాట్లాడాలని కోరారు. పార్ట్‌టైం టీచర్లను అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కాంట్రాక్ట్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేష్ బోనకుర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, జూలు నాగేశ్వర్‌రావు, యుగేందర్, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ పాలడుగు జీవన్, విష్ణు, భూపతి, సునీల్, డా. సంపత్, శివ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి




రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించడంతో పాటు ఈ రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. బుధవారం ఏబీవీపీ సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ ప్రాంతంలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలు, మహేష్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజులను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, హెల్త్ సెంటర్లలో వైద్య పరికరాలు, మందులు, డాక్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజులను సెమిస్టర్ ఫీజులను తగ్గించాలని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మార్కెట్ పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు సాకేత్ చందు, గన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఓయూలో ఏబీవీపీ విద్యార్థుల రాస్తారోకో

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి. బుధవారం ఎన్‌సీసీ గేటు వద్ద విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ స్టేట్ యూనివర్సిటీ కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు డిగ్రీ పూర్తయినా సర్టిఫికెట్లు తీసుకోలేక పోతున్నారన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలని లేని పక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీంతో విద్యార్థులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సుమన్ శంకర్, రాజు, అశోక్, పరశురాం, కోగి, సాయి, హరి ప్రసాద్, శివ శంకర్, విష్ణు చైతన్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు

తార్నాక డివిజన్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీగా చింతల్ కృష్ణ



లాలాపేట: తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీగా తార్నాక చింతల్ బస్తీకి చెందిన ఎనుగంధుల కృష్ణ(కిట్టు)ను నియమిస్తూ డివిజన్ అధ్యక్షులు ఎన్. బ్రహ్మజీ ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఈ బాధ్యతను తనకు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధినాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అమర్‌నాథ్‌గౌడ్, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



బేగంపేట నాలా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: దశాబ్దాలుగా పరిష్కారం కాని వరద ముంపు సమస్యకు ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వివిధ శాఖ అధికారులతో కలిసి బుధవారం బేగంపేటలోని బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీల్లో నాలా అభివృద్ధి పనులు, నూతనంగా చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తమ బస్తీలు ఇంత అభివృద్ధి చెందుతాయని తాము కలలో కూడా ఊహించలేదని స్థానికులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణవాడీలోని లైన్‌నెంబర్-4లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో నాలాలో మిగిలిన పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో నాలాకు ఎగువ నుంచి వచ్చే వరద కారణంగా పరిసర బస్తీల్లోకి నీరు చేరి ఇళ్లు ముంపునకు గురయ్యేవన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం ద్వారా నగరంలోని అనేక నాలాల అభివృద్ధి పనులను చేపట్టిందని తెలిపారు. సుమారు రూ.45 కోట్ల వ్యయంతో బేగంపేట నాలా అభివృద్ధి పనులతో పాటు పరిసర కాలనీల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దీంతో వరద ముంపు సమస్య కష్టాలు తొలగిపోయినట్లేనని ఆయన చెప్పారు. ఆయన వెంట కార్పొరేటర్ మహేశ్వరి, డీసీ శంకర్, ఈఈ సుదర్శన్, ఎస్ఎన్‌డీపీ ఈఈ శ్రీధర్, వాటర్‌వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం శశాంక్, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, నరేందర్‌రావు, శేఖర్, కిషోర్, ఆకుల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో దేశాభివృద్ధి



సనత్‌నగర్: అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్‌ను చేర్చడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. బుధవారం 'బస్తీ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ డివిజన్ బూత్‌నెంబర్ 210లో కొత్త ఓటరు నమోదు, వికసిత్ బ్రాండ్ అంబాసిడర్‌గా చేర్పించడం తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులతో పాటు స్థానిక కుటుంబాలను కలిసి మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బూత్ ఇన్‌ఛార్జి, ఓబీసీ మోర్చా సనత్‌నగర్ అసెంబ్లీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనతో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. క్లిష్టమైన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. గ్రామ గ్రామాన లబ్ధిపొందే విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారన్నారు. విస్తృతంగా కొత్త ఓటరు నమోదు, వికసిత్ బ్రాండ్ అంబాసిడర్ల చేరిక కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం గౌడ్, కన్నూరి క్రాంతికుమార్, దయానంద్, నరేష్, ఐలయ్య, రాజా మిథుల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

సికింద్రాబాద్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆమె జలమండలి అధికారులు, సీతాఫల్‌మండి ప్రాంత ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో నీటి సరఫరాలో లోప్రెషర్, కలుషితమైన తాగునీరు వంటి సమస్యలు లేకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీతాఫల్‌మండి విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్, విద్యుత్‌శాఖ ఏడీఈ మహేశ్, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, సీతాఫల్‌మండి ప్రాంత నాయకులు జీ.చంద్రశేఖర్, టీఆర్‌టీ శేఖర్, గడ్డం ప్రసాద్, అశ్వీన్‌కుమార్, మామిడిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

ముదిరాజ్‌ల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

సనత్‌నగర్: ముదిరాజ్‌ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్‌లకు బీసీ రిజర్వేషన్లలో జరిగిన అన్యాయం కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2009లో జీఓ 15 ద్వారా బీసీ-డీ జాబితాలో నుంచి బీసీ-ఏ జాబితాలో చేరిన తమ సామాజిక వర్గానికి ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదన్నారు. గత 14 ఏళ్లలో తమ న్యాయమైన హక్కు కోసం పోరాడుతున్న తమను బీసీ-ఏ జాబితాలో చేర్చేందుకు సుప్రీంకోర్టులో 2022లో మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అయితే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ-ఏ జాబితాలో చేర్చకుండా మీనమేషాలు లెక్కిస్తూ ముదిరాజ్‌లను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో మార్చే అంశాన్ని పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆస్టర్ ప్రైమ్‌కు హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా అవార్డు

అమీర్‌పేట: ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రికి అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా అవార్డు లభించినట్లు ఆసుపత్రి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజినల్ సీఈఓ కేటీ దేవానంద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందించే ఆసుపత్రులకు ఏటా ఈ అవార్డులు అందజేస్తారన్నారు. 2024 సంవత్సరానికి గాను అమీర్‌పేట ప్రైమ్ ఆసుపత్రి అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ఆపరేషన్స్ మేనేజర్ షైనీ ప్రియాంక తదితరులు అవార్డు స్వీకరించారన్నారు. అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి క్వాలిటీ మేనేజర్ హర్షిణి,డైరెక్టర్ జనరల్ గిరిధర్ గ్యాని పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



రమాబాయికి నివాళులర్పిస్తున్న ఎంఎస్పీ నాయకులు

బౌద్ధనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు మహాజన నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పని చేస్తామని ఎంఎస్పీ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు టీవీ. నర్సింహ్మారావు అన్నారు. పార్సీగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో బుధవారం రామా బాయి అంబేడ్కర్ 127వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్, రమాబాయి ఆశయాలను సాకారం చేసేలా అన్ని వర్గాలను ఏకం చేసి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు డప్పు మల్లికార్జున్, కొప్పుల సాయికుమార్, తుమ్మల శివ ప్రసాద్, ఎల్లయ్య, డప్పు మహేష్, త్రినేత్ర, నరేష్, మల్లేష్, శ్యామూల్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పతనం ఖాయం



చిలకలగూడ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పతనం ఖాయమని, బీజేపీని చిత్తుగా ఓడించేందుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం దూద్‌బావి కమ్యూనిటీ హాల్‌లో మెట్టుగూడ డివిజన్ సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అచ్చాదిన్ ఆగయా' నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచుకుంటూ సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. మోదీ హటావో.. దేశ్‌కీ బచావో నినాదంతో ఎన్నికల ప్రచారం చేపట్టి బీజేపీని చిత్తుగా ఓడిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, యాదగిరి, ఆంజనేయగౌడ్, హనుమంతు, యాకయ్య, చందర్, వెంకటయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం



రసూల్‌పురా: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు లోని వివిధ బస్తీల్లో ఎమ్మెల్యే నిధులతో పవర్‌బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు మాజీ సభ్యురాలు బి. అనిత ప్రభాకర్ తెలిపారు. బుధవారం కార్ఖానా కౌసర్ గల్లీలో రూ.4.5 లక్షల వ్యయంతో పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి ఎద్దడి సమస్యను ఎమ్మెల్యే లాస్య నందిత దృష్టికి తీసుకెళ్లగానే నాలుగు పవర్‌బోర్‌వెల్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. వార్డు ప్రజల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నిత్యానంద్, అక్తర్, సాయి, ఫహీమ్, అబ్దుల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అమీర్‌పేట: కల్లు కాంపౌండ్ ఎదుట ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం సనత్‌నగర్ స్వామి కాంప్లెక్స్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా, వేల్పులపాడుకు చెందిన జయరాజు (31) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి బీకేగూడలో నివాసం ఉంటూ కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన జయరాజు మంగళవారం రాత్రి మద్యం మత్తులో కల్లు కాంపౌండ్ ఎదుట రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు అతడిని లేపి పక్కన పడుకోబెట్టారు. బుధవారం ఉదయం అతను లేవక పోడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా భార్య ఇటీవలే సొంత ఊరికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.